# దేహాభిమానమును త్యజించి ఏకత్వాన్ని విశ్వసించండి

విశ్వమంతయు వ్యాప్తియై వెలయువాడు
భక్తజనులకు ప్రాపుయై పరగువాడు
భక్తి నొసగి రక్షించెడి శక్తిమయుడు
పర్తివాసుడు మిమ్మేల ఎత్తుకొనడు!

ప్రేమస్వరూపులారా!

దైవానుగ్రహముచేతనే మానవుడు జీవిస్తున్నాడు. కాని, ధనమువలన, తిండివలన, గుడ్డలవలన, ఇండ్లవలన తాను జీవించగల్గుతున్నానని అనుకుంటున్నాడు. కాదు, కాదు. ఈ జగత్తులో ఎంతమంది ధనవంతులు లేరు! కాని, వారేమైనా సుఖంగా జీవిస్తున్నారా? లేదు. ధనమును సంపాదించినంతమాత్రమున, కాలేజీలో చదివినంతమాత్రమున, విదేశాలకు వెళ్ళినంతమాత్రమున సుఖముగా జీవించుటకు వీలుకాదు. దైవానుగ్రహం లేక మానవుడు ఏదీ సాధించలేడు. కనుక, మానవుడు అన్నింటికంటే ముందు దైవాన్ని స్మరించాలి.

**'ఎడ్యుకేషన్' - 'ఎడ్యుకేర్'**

కొందరు తాము గొప్పగొప్ప డిగ్రీలు పొందినామని గర్విస్తారు, పాపం! ఇదంతా కేవలం బుకిష్ నాలెడ్జి (గ్రంథపరిచయం). ఈ బుకిష్ నాలెడ్జిని మాత్రమే ఈనాడు అందరూ పెంచుకుంటున్నారు. ఈ పుస్తకాలు లేనప్పుడు ప్రజలు ఎంత సుఖశాంతులతో జీవించారో ఒక్కసారి మీరు ఆలోచించండి. ఈ పుస్తకాలద్వారా తెలుసుకున్న విద్యను మీరు 'ఎడ్యుకేషన్' అంటున్నారు. ఇది నిజమైన విద్య కాదు. 'ఎడ్యుకేర్' లేని 'ఎడ్యుకేషన్'వలన ఏమీ

sri sathyasai vachanamrutam

ప్రయోజనం లేదు. 'ఎద్యుకేర్' అనగా మనలోపల ఉన్న దివ్యత్వాన్ని ఆవిర్భవింపజేసే విద్య. దివ్యత్వమునకు 'కాన్షియస్‌నెస్' అని పేరు. మానవునియందు 'కాన్షియస్‌నెస్' అనేది ఉండటంచేతనే తాను అన్నీ తెలుసుకోగలుగుతున్నాడు. కాని, తనలోనే ఉన్న 'కాన్షియస్‌నెస్'ను తాను గుర్తించటం లేదు. 'కాన్షియస్‌నెస్' అనేదే సర్వ మానవులను సంరక్షిస్తున్నది. ఎంతటి గొప్ప విద్యావంతులైనా, గొప్ప పండితులైనా, గొప్ప గ్రంథములు చదివిన వారైనా ఈ సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నారు.

ప్రాపంచికమైన ఎడ్యుకేషన్ కేవలం నెగెటివ్ తత్త్వముతో కూడినది. ఇలాంటి కృత్రిమమైన చదువు చదివి మీరు సాధించేది ఏమిటి? ఈవిధమైన ఎడ్యుకేషన్‌కోసమని మానవులు అనేక దేశములకు వెళుతున్నారు. ఐతే, నిజమైన విద్యను అభ్యసించటానికి ఎక్కడికీ పోనక్కర్లేదు. అదే 'ఎద్యుకేర్'. అది అంతర్భావమునుండి ఆవిర్భవిస్తుంది; మానవుణ్ణి అన్నివిధాలుగా సంరక్షిస్తూ వస్తుంది. మనస్సు, మాట, క్రియ – ఈ మూడింటి ఏకత్వమే 'ఎద్యుకేర్'. తనను తాను తెలుసుకున్నవాడే నిజమైన విద్యావంతుడు.

ఈనాటి మానవుడు ప్రపంచంలో అన్నీ తెలుసుకుంటున్నాడు. 'ఇతనెవరు? అతనెవరు?' అనేది తెలుసుకుంటున్నాడుగాని, 'నేనెవరు?' అనేది తాను తెలుసుకోవడం లేదు. Who are you? అని ఎదుటి వ్యక్తిని ప్రశ్నిస్తున్నాడుగాని, Who am I? అని తనను తాను ప్రశ్నించుకోవడం లేదు. తానెవరో తెలుసుకోవడమే నిజమైన విద్య. 'అయ్యా! నీవెక్కడినుండి వచ్చావు?' అని ప్రశ్నించినప్పుడు 'నేను అమెరికానుండి వచ్చాను', అని చెబుతున్నావు. ఇది నెగెటివ్ భావముతో చేరినటువంటిది. 'నేను' అంటే ఎవరో తెలుసుకోకుండా 'నేను వచ్చాను', అని చెబుతున్నావు. 'నేను' అనే కాన్షియస్‌నెస్ అన్నిచోట్ల ఉన్నది. మరి అమెరికానుండి ప్రయాణమై వచ్చింది ఎవరు? దేహము. కాబట్టి, 'నీవెవరు?' అని ప్రశ్నించినప్పుడు 'నేను నేనే' అన్నదే సరియైన ఆన్సరు.

**మనస్సును కాదు, ఆత్మను ఆధారం చేసుకోవాలి**

'ఇది నా దేహము', 'ఇది నా మనస్సు', 'ఇది నా బుద్ధి' అని అంటున్నాము. ఇవన్నీ

sri sathyasai vachanamrutam

కేవలం పనిముట్లు. ఈనాడు మనస్సుయొక్క తత్త్వాన్ని అనేక విధములుగా పరిశోధన చేస్తున్నారు. మనస్సు పిచ్చికోతివలె చంచలమైనది. Mind is like a mad monkey. ఈ 'మంకీ మైండు'ని పట్టుకొని 'నేను, నేను' అనుకుంటున్నావు. ఇదెంత తప్పు! Body is like a water bubble. దేహము నీటిబుడగవలె క్షణభంగురమైనది. ఈ 'నీటిబుడగ' నీవు కాదు. Mad monkey వంటి మనస్సు నీవు కాదు. నీది Mankind (మానవజాతి). Kindness (దయ)తో కూడిన వాడే నిజమైన మానవుడు. కాని, ఈనాటి మానవునిలో ఏమాత్రము దయ, దాక్షిణ్యములు కనిపించడం లేదు. ఈనాడు Mankind అనేది Monkey mind గా మారిపోయింది.

'ఎడ్యుకేర్' అంటే తనను తాను తెలుసుకోవడం. తనను తాను తెలుసుకోవాలంటే అమనస్కస్థితిని చేరుకోవాలి. మైండును పట్టుకొని ప్రయాణం చేస్తే ఎక్కడికి పోయి చేరతావో తెలిసేది లేదు. కాబట్టి, ఆత్మను పట్టుకొని ప్రయాణం చేయి. ఆత్మ లేకపోతే దేహము ఏమాత్రము పని చేయలేదు. ఆత్మనుగురించి తెలుసుకోవడమే 'ఎడ్యుకేర్'. ఈనాటి మానవుడు భౌతికమైన దేహమే తాననే భావనతో 'నేను, నేను' (I) అంటున్నాడు. కాని, దేహానికి 'నేను' (I) అనే పదము వర్తించదు. 'నేను' అనగా అహం. ఆకారమే 'నేను' అని భావిస్తే అది అహంకారమవుతుంది. అహంకారం ఉన్నంతవరకు మనకు ఆత్మతత్త్వం అర్థం కాదు. అహంకారమును ప్రక్కకు నెట్టి సమత్వాన్ని, ఏకాత్మ భావాన్ని పెట్టుకోవాలి. అందరియందు ఒక్క ఆత్మ తప్ప మరొకటి లేనే లేదు. దీనినే Fundamental Principle (మూలాధార తత్త్వము) అని పిలుస్తున్నాము. ఈ మూలాధార తత్త్వము ఉన్నప్పుడే దేహానికి విలువ ఇస్తున్నాము. ఇది లేకపోతే దేహానికి విలువలేదు. అట్టి మూలాధార తత్త్వాన్ని గుర్తించుకున్నప్పుడే మనం నిజమైన మానవులమవుతాము. ఈ లోకములో పశు, పక్షి, మృగాదులనేకం ఉంటున్నాయి. అవీ జీవిస్తున్నాయి, నీవూ జీవిస్తున్నావు. ఇంక, నీవు 'మానవుడ'ని పేరు పెట్టుకోవడంలో గల ఔచిత్య మేమిటి? మొట్టమొదట మూలాధార తత్త్వమును నీవు గుర్తించడానికి ప్రయత్నించాలి. ఇందు నిమిత్తం మన ప్రాచీన సంస్కృతిని అనుసరిస్తూ రావాలి.

sri sathyasaivachanamrutam

**దేహిని తెలుసుకోవడమే నిజమైన విద్య**

మనిషికి ఒక రూపం ఉంది. కాని, మూలాధార తత్త్వానికి ఒక రూపం లేదు. అది అన్ని జీవులయందు సమానంగా ఉంటున్నది. ఈనాటి మానవుడు కేవలం దేహసంబంధమును మాత్రమే దృష్టిలో పెట్టుకోవడం వలన అనేక చింతలకు గురియౌతున్నాడు. జీవితం 'ఆర్టిఫీషియల్' (కృత్రిమం)గా తయారైంది. దేహభావమును వీడనంతవరకు నీవెవరివో నీకు తెలియదు. సర్వులయందున్న 'నేను' అన్నదే నీ నిజతత్త్వము. అదే Fundamental Principle. దానిని నీవు కనుక్కోవాలి. దేహమే 'నేను' అని భావించకూడదు.

**దేహము పాంచభౌతికము,**
**దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు, గణుతింపగ**
**దేహికి చావు, పుట్టుకల్**
**మోహనిబంధ బంధనల**
**ముద్రలు లేవు; నిజంబు చూడ యీ**
**దేహియె దేవదేవుడు,**
**మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

పుట్టటము, చావటము దేహమునకేగాని, దేహికి కాదు. 'నేను' అనే దేహికి చావు, పుట్టుకలు లేవు.

**చావు, పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆది మధ్యాంతరహితు డనాదివాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**అంతట సర్వసాక్షియై అలరుచుండు**

సర్వత్రా ప్రకాశించువాడు దేహి. భిక్షగాడు ఇంటి ముందుకు వచ్చి, 'భవతీ భిక్షాం దేహి' అంటాడు. 'దేహి' అనేది దైవముయొక్క పేరు. అట్టి దేహిని తెలుసుకోవడమే నిజమైన విద్య.

sri sathyasai vachanamrutam

గ్రంథాలు చదివి తెలుసుకునేది విద్య కాదు. అదంతా కేవలం బుకిష్ నాలెడ్జి. పుస్తకాలు చదవటం కేవలం పొట్టకూటికోసం చేసే పని. ఇది కాదు మనం చేయవలసినది. మనం చేయవలసినది వేరే ఉంటున్నది.

**చదివి వ్రాయ నేర్చినవారంతా విద్యార్థులేనా!**
**కాలేజీ డిగ్రీలు పొంద విద్యావంతులగునా!**
**సుజ్ఞానము సుకృతము లేని విద్యలు సద్విద్యలగునా!**
**బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకలేవె పశుపక్షులు!**

ఒకరు గొప్ప లక్షాధికారిగా ఉండవచ్చును. ఎంత గొప్ప లక్షాధికారి యైనప్పటికీ దేహమున్నంతవరకే 'ఇతడు ఫలనావాడు', అని అంటారు. ఆ తరువాత అతని గురించి, అతని ఆస్తిపాస్తులనుగురించి ఏమాత్రం చింతించరు. మనము విలువనివ్వవలసినది ఆత్మతత్త్వమునకేగాని, ఆస్తిపాస్తులకు కాదు.

**అశాంతికి కారణం 'నేను' ఎవరో మరచిపోవడమే!**

ఈనాడు ఒక్కరైనా శాంతిగా జీవించడం లేదు. జీవితమంతా అశాంతి మయంగా ఉంది. కారణం? ఆత్మతత్త్వాన్ని గుర్తించుకోలేకపోవడమే! ఆత్మతత్త్వాన్ని తెలుసుకోలేకపోయినప్పుడు ఏమి తెలుసుకున్నా అంతా వ్యర్థమే! ఈ జగత్తులో మనము జీవించడానికి లౌకిక విద్యలుకూడా అవసరమే. ఈ లౌకిక విద్యలతోపాటు సర్వులయందు సమత్వంగా ఉన్న 'నేను' ఎవరో గుర్తించాలి. ఇతనియందున్నది, ఆమెయందున్నది, అందరియందున్నది ఆ మూలాధార తత్త్వమే. డాక్టరు ఎవరు? అంటే ఆయన లేచి 'నేను' అంటాడు. డాక్టరు అనే డిగ్రీ అతని దేహానికి సంబంధించినదేగాని, 'నేను' అనే మూలాధార తత్త్వానికి సంబంధించినది కాదు. మూలాధారమైన 'నేను'ను మరచిపోయి కేవలం దేహసంబంధమైన 'నేను'ను జ్ఞప్తియందుంచుకోవడంవలన మీరు సత్యాన్ని గుర్తించుకోలేక పోతున్నారు.

దేవుడెక్కడున్నాడు? అందరియందు ఉంటున్నాడు. 'ఈశ్వర స్సర్వభూతానాం'.



srisathyasaivachanamrutam

'ఈశావాస్య మిదం సర్వం'. దేహము మార్పు చెందవచ్చునుగాని, దేహి మార్పుచెందడానికి వీలులేదు. మైసూర్‌పాక్, గులాబ్‌జామ్, మిఠాయి, పాలకోవా.... ఈవిధంగా పేర్లు వేర్వేరుగాని, అన్నిటియందున్న చక్కెర ఒక్కటే కదా! ఆ చక్కెర వంటిదే అందరిలో ఉన్న 'నేను' అనే ఆత్మతత్త్వము. 'నేను ఆత్మస్వరూపుడన'ని గుర్తించినప్పుడే మానవుడు ఆనందంగా ఉంటాడు. ఈ సత్యాన్ని గుర్తించడంచేతనే పూర్వం మానవులు యోగివరులుగా ఉండేవారు. యోగి అనగా అన్నీ వదలి పెట్టినవాడు కాదు; అన్నీ తనయందే ఉంటున్నాయన్న సత్యాన్ని గుర్తించినవాడు.

నేను అప్పుడప్పుడు చెబుతుంటాను, 'నీవు కేవలం ఒక్క వ్యక్తివి కావు; నీలో ముగ్గురున్నారు' – 1. The one you think you are (నీవనుకునే నీవు) 2. The one others think you are (ఇతరులనుకునే నీవు) 3. The one you really are (నిజమైన నీవు). నీవనుకునే నీవు – దేహము. ఇతరులనుకునే నీవు – మనస్సు. నిజమైన నీవు – ఆత్మ. అది ఎప్పటికీ మారేటటువంటిది కాదు. దేహానికి 'హార్టు' (గుండె) చాలా ప్రధానమైనది. హార్టు లేక దేహమే లేదు. అయితే, అట్టి హార్టుకుకూడా ఆధారమైన తత్త్వాన్ని మనం 'ఆత్మ' అంటున్నాము.

**దేహాన్ని మరచినప్పుడే అంతర్యామిని గుర్తించగలవు**

'నా కుమారుడు అమెరికాలో గొప్ప ఉద్యోగం చేస్తున్నాడు', అని అంటావు. ఎవరు నీ కుమారుడు? అమెరికాలో ఉన్నవాడా? ఇంగ్లాండులో ఉన్నవాడా? కాదు. కేవలం రూపాన్ని బట్టి, 'ఇతను నా కుమారుడు' అంటున్నావు. రూపమే లేకపోతే ఎవరు నీ కుమారుడు? ఈనాడు నీ కుమారునికి నీవు వివాహం చేశావు. ఒక అమ్మాయి నీ ఇంటికి వచ్చింది. 'ఈమె ఎవరు?' అంటే 'నా కోడలు' అంటావు. పెండ్లికి పూర్వము ఈ కోడలెవరు? ఈవిధమైన సంబంధ బాంధవ్యాలన్నీ దేహాభిమానమువలన ఏర్పడినవే. ఇవన్నీ పూర్వము లేవు, తరువాత లేవు. కదలిపోయే మేఘాలవలె మధ్యలో వచ్చి మధ్యలోనే పోతాయి. దేహాభిమానము ఉన్నంతవరకే ఒకరిని బంధువుగా, ఒకరిని మిత్రునిగా, మరొకరిని

sri sathyasai vachanamrutam

శత్రువుగా భావిస్తావు. కాబట్టి, నీవు దేహముతో సంబంధమే పెట్టుకోవద్దు. నీవు ఎప్పుడు దేహాన్ని మరచిపోతావో అప్పుడే అంతర్యామిని గుర్తించగలుగుతావు.

**ప్రపంచంలో అన్నీ జీరోలే! ఆత్మ ఒక్కటే హీరో!**

మీరు మా పిల్లల్నెవరినైనా అడగండి, 'Where is God?' (దేవుడు ఎక్కడున్నాడు?) అని. 'He is everywhere' (ఆయన సర్వాంతర్యామి) అని చెబుతారు. నిజానికి నీవే దైవానివి. కాని, దేహాభిమానముచేత ఈ సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నావు. ఈ దేహము ఎప్పటికీ ఉండేది కాదు. ఈనాడు ఉంటుంది, రేపు పోతుంది. దేహమున్నంతవరకు 'నేను' అంటావు. దేహమును కోల్పోయిన తరువాత 'నేను' ఎవరు? ఈవిధంగా విచారణ చేస్తే, ఈ ప్రపంచంలో చూచేవన్నీ జీరోలే. ఎక్కడా కనిపించకుండా ఉన్న 'నేను' అనే ఆత్మతత్త్వమే హీరో. You are not zero. You are a hero. రక్త, మాంసములతోకూడిన ఈ దేహాన్ని కదిలించేది ఆత్మతత్త్వమే. అదే 'నేను'. కాని, కదలిపోయే మేఘములాంటి దేహమే 'నేను' అనుకొని నీవు దేహాభిమానాన్ని అభివృద్ధిపరచుకుంటున్నావు. నిత్యమైన, సత్యమైన, శాశ్వతమైన ఆత్మతత్త్వాన్ని తెలుసుకోవడంకోసమే నీవు దేహాన్ని ధరించావు. ఏ కార్యము నిమిత్తమై ఈ దేహము ఉద్భవించిందో ఆ కార్యమునకు మాత్రమే ఈ దేహాన్ని ఉపయోగించుకోవాలి. నిన్ను నీవు తెలుసుకోవడానికి ఈ దేహమును ఒక పనిముట్టుగా వినియోగించుకోవాలి. అంతేగాని, దేహాభిమానమును పెంచుకోకూడదు.

**ఆత్మాభిమానమే ఆధ్యాత్మికము**

ఈనాడు గొప్పగొప్ప విద్యావంతులుకూడా కేవలం దేహాభిమానముతో జీవితాన్ని గడుపుతున్నారు. ఈ 'అటాచ్‌మెంట్'వల్లనే మనకు దుఃఖము, విచారము కలుగుతాయి. దేహముతో 'అటాచ్‌మెంట్'ను త్యజించి ఆత్మ తత్త్వముతో 'అటాచ్‌మెంట్'ను సంపాదించుకోండి. 'రాముని దర్శించాలి', 'కృష్ణుని దర్శించాలి', అని మీరు దేహాభిమానముతో కోరుతున్నారు. దేహాభిమానముతో ఆత్మతత్త్వమును దర్శించడానికి వీలుకాదు. ఆత్మకు ఎటువంటి 'అటాచ్‌మెంట్'కూడా లేదు. అది నీయందున్నది, నాయందున్నది, అందరియందున్నది. 'ఏకాత్మా సర్వభూతాంతరాత్మ'. అటువంటి సర్వ

sri sathyasai vachanamrutam

భూతాంతరాత్మయే నీవు. కేవలం పాంచభౌతికమైన దేహము నీవు కాదు. ఇట్టి సత్యాన్ని గుర్తించడమే నిజమైన ఆధ్యాత్మికము; అంతేగాని, కేవలము భజనలు, పూజలు, వ్రతములు చేయడం కాదు.

**ఏకత్వాన్ని అనుభవించేవాడే నిజమైన భక్తుడు**

ఒక పర్యాయం కొందరు సీతాదేవిదగ్గరకు వచ్చి, "అమ్మా! నీ శ్రీరాముడు ఎక్కడున్నాడు?" అని ప్రశ్నించారు. సీత చెప్పింది, "శ్రీరాముడు ఎల్లప్పుడు నాతోనే ఉన్నాడు" అని. మీ దృష్టిలో శ్రీరాముడు దశరథ మహారాజుయొక్క కుమారుడు, జనక మహారాజుయొక్క అల్లుడు. కాని, నిజానికి రాముడు ఎవ్వరికీ కుమారుడు కాదు; ఎవ్వరికీ అల్లుడు కాదు. ఆయన అందరివాడు. కేవలం దేహాభిమానమును పురస్కరించుకొని 'అత్త, మామ, కొడుకు, కోడలు' అని ఈవిధంగా పేర్లు పెట్టుకొని, భౌతికమైన సంబంధ బాంధవ్యములను ఏర్పర్చుకొని జీవిస్తున్నాము. ఈ 'అంకుల్' ఎక్కడినుండి వచ్చాడు? 'ఆంటీ' ఎక్కడినుండి వచ్చింది? నీవెక్కడినుండి వచ్చావు? ఎవరినైనా ఈ ప్రశ్నలు అడగండి, ఏమి చెబుతారో చూద్దాం. ఏమీ చెప్పలేరు. ఇవన్నీ మనము కల్పించుకున్నవి. అంతా ఒక్కటే అని గుర్తించినవానికి ఏ చింతా ఉండదు. ఏకత్వాన్ని విశ్వసించినప్పుడే దైవత్వాన్ని విశ్వసించినవారమవుతాము. ఏకత్వాన్ని విశ్వసించక భిన్నత్వాన్ని విశ్వసించి అనుసరిస్తే జీవితమంతా బంధన తప్పదు. నిజంగా చూస్తే మీరు బంధితులు కారు. మీరు ఆత్మస్వరూపులు. కాబట్టి, మీరు దేహాభిమానం విడిచిపెట్టి ఆత్మాభిమానముతో జీవితాన్ని గడపండి. ఆత్మాభిమానంతో అందరితో కలసి మెలసి జీవించండి. అప్పుడే మీకు ఆనందము లభిస్తుంది. అట్టి ఏకత్వాన్ని అనుభవించేవాడే నిజమైన భక్తుడు. ఈవిధమైన ఏకత్వానుభవము లేక దేహాభిమానముతో జీవితాన్ని గడుపుతూ మీరు ఎన్ని సాధనలు చేసినా జనన, మరణ చక్రమునుండి తప్పించుకోవటానికి వీలుకాదు. ఏకత్వాన్ని మీరు విశ్వసించండి. దేహాభిమానాన్ని వదలిపెట్టి సాధన చేయండి. ఈనాడు మీరు దివ్యత్వంకొరకు సాధన చేస్తూ దేహాన్ని స్మరిస్తూ ఉన్నారు. అది మీ తప్పే కదా! మీ సాధనలో ఇటువంటి పొరపాటు లేకుండా చూసుకోండి. అప్పుడు మీకు ఏకత్వము తప్ప

sri sathyasai vachanamrutam

భిన్నత్వమనేది కనిపించదు. అందరియందున్న ఆత్మతత్త్వమనే 'యూనిటీ'ని తెలుసుకోవాలి. అనేకమంది నూరు సంవత్సరాలు బ్రతుకుతున్నారు. కాని, ఎన్ని సంవత్సరాలు బ్రతికినా భిన్నత్వంలోనే జీవిస్తున్నారుగాని, ఏకత్వాన్ని భావించుకోవటం లేదు. మొట్టమొదట మీరు దేహాభిమానాన్ని, ద్వైత భావాన్ని త్యజించాలి. అప్పుడే మీకు ఏకత్వం సాక్షాత్కరిస్తుంది.

**– శ్రీవారి దివ్యబోధ, తేదీ 03.09.2005, సాయికుల్వంత్ హాలు**

sri sathyasai vachanamrutam